సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం, 16, నవంబర్, 2022



మెరుగైన వైద్యం అందించండి
- పాడేరు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ఆదేశం
- కేజీహెచ్‌లో ట్రైబల్ సెల్ సందర్శన
- సత్వర వైద్యం అందేలా సూచనలు

8లో



చలిగాలుల విజృంభణ
- మినుములూరులో 12..
- అరకులోయలో 12.7..
- చింతపల్లిలో 13 డిగ్రీలు నమోదు

8లో

అథ్లెటిక్స్‌లో మెరిసిన గిరి యువకుడు
- 1500 మీటర్ల రాష్ట్రస్థాయి పరుగుపందెంలో బంగారు పతకం
- జాతీయ స్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన ప్రసాద్



8లో

న్యూస్‌రీల్

గాడిద పాలుకు మంచి డిమాండ్

అడ్డతీగల వారపు సంతలో అమ్మకాలు



మార్కెట్‌కు గాడిదను తీసుకువచ్చిన యజమాని

అడ్డతీగల: అడ్డతీగలలో మంగళవారం జరిగిన వారపుసంతలో గాడిద పాలు విక్రయాలు జరిగాయి. విజయవాడ నుంచి ఎనిమిది మంది గాడిదలను తీసుకువచ్చి వీధుల్లో తిరుగుతూ వాటి పాలను విక్రయించారు. ఆరోగ్యానికి శ్రేయస్కరమని ప్రచారం జరగడంతో కొనేందుకు స్థానికులు ఆసక్తి చూపారు. పాలు 20 గ్రాములను రూ.150, 40 గ్రాములను రూ.250కి విక్రయించారు.

సత్తాచాటిన డీఏవీ విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన డీఏవీ విద్యార్థులతో అధికారులు, ఉపాధ్యాయులు

సీలేరు: ఈనెల7,8 తేదీల్లో నిర్వహించిన స్కూల్‌గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీల్లో స్థానిక డీఏవీ పాఠశాల విద్యార్థులు సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాలుర విభాగం కబడ్డీలో అమీర్‌బాష, ఆషిక్, నవీన్, హేమంత్, బాలికల విభాగం ఖోఖోలో వర్షిణి, షారుణ్, అంబిక ఎంపికయ్యారు. వీరు త్వరలో అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లో జరిగే పోటీల్లో పాల్గొననున్నారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఏపీ జెన్‌కో ఎస్‌ఈ ప్రశాంత్‌కుమార్, ఈఈ జాకీర్‌హుస్సేన్, ప్రధానోపాధ్యాయుడు రామచంద్రరావు సన్మానించారు.

ఆడాకుల వీఆర్పీపై చర్యలకు సిఫార్సు

చింతపల్లి ఏపీడీ రామారావు

కొయ్యూరు: అవినీతికి పాల్పడిన ఆడాకుల వీఆర్పీ లక్ష్మిపై చర్యలకు సిఫార్సు చేస్తున్నామని చింతపల్లి జాతీయ ఉపాధి హామీ పథకం ఏపీడీ రామారావు మంగళవారం తెలిపారు. ఆడాకులలో భారీస్థాయిలో అవినీతి జరిగినట్టు నిర్ధారణకు వచ్చినట్టు ఆయన వివరించారు. స్థానికంగా లేనివారి పేర్లు, పాఠశాలలో చదివే వారి పేర్లు నమోదు చేసి మస్టర్లు వేశారన్నారు. దీనిపై జరిగిన విచారణలో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయన్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేసి వీఆర్పీపై చర్యలకు సిఫార్సు చేస్తున్నామని తెలిపారు.నివేదికను ఐటడీఏ పీవో గోపాలకృష్ణకు పంపిస్తామని ఆయన వివరించారు.

అమరావతికి జిల్లా ఎమ్మెల్యేలు

సాక్షి,పాడేరు: జిల్లాకు చెందిన గిరిజన ఎమ్మెల్యేలంతా అమరావతికి మంగళవారం బయలుదేరారు. నియోజకవర్గాల అభివృద్ధికి సంబంధించి తాడేపల్లిలో బుధవారం నిర్వహించే సమావేశానికి హాజరుకావాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నుంచి ఆదేశాలు వచ్చాయని ఈమేరకు బయలుదేరామని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. పాడేరు, రంపచోడవరం ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, నాగులాపల్లి ధనలక్ష్మి, తమ వాహనాల్లో అమరావతి పయనమయ్యారు.

సీహెచ్‌సీ వైద్యాధికారి సరెండర్

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఉత్తర్వుల జారీ

అడ్డతీగల: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నారనే కారణంతో అడ్డతీగల సీహెచ్‌సీ వైద్యాధికారి అనంద్ రామకృష్ణను జిల్లా కేంద్రమైన పాడేరులోని జిల్లా కోఆర్డినేటర్ (వైద్యసేవల విభాగం)కు సరెండర్ చేస్తూ రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆస్పత్రి సిబ్బంది, అడ్డతీగల గ్రామస్తులు స్పందనలో చేసిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని ఈ చర్యలు తీసుకున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఆస్పత్రిలోని మినీ ఎస్ఎన్‌సీయూ విభాగంలో వైద్యురాలితో పాటు ఇతర సిబ్బంది విధుల్లో తరచూ జోక్యం చేసుకుంటూ ఇబ్బంది పెడుతున్నట్టు వైద్యాధికారిపై ఫిర్యాదులు అందనట్టు పీవో పేర్కొన్నారు. పేషెంట్లకు సేవలందించడంలో అలసత్వంగా వ్యవహరించడమే కాకుండా వాదనలకు దిగడం వల్ల పేషెంట్లు వారి బంధువులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నట్లు తరచూ ఫిర్యాదులు అందాయన్నారు. వీటిని పరిగణనలోకి తీసుకుని వైద్యాధికారిని సరెండర్‌చేసినట్టు ఆయన పేర్కొన్నారు. ఆయనపై వచ్చిన ఫిర్యాదులను పరిగణించి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పీవో పేర్కొన్నారు.

యువతకు ఆదర్శం బిర్సా ముండా

- ఆదివాసీలకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- రాష్ట్ర ఉపముఖ్యమంత్రి రాజన్న దొర
- ఘనంగా ప్రారంభమైన గిరిజన గౌరవ వారోత్సవాలు
- 3 వేల మంది గిరిపుత్రులతో కార్నివాల్
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సంప్రదాయ నృత్యాలు



కూరగాయల స్టాల్‌ను పరిశీలిస్తున్న రాజన్నదొర, ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ తదితరులు

బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): గిరిజన యువతకు బిర్సాముండా ఆదర్శనీయుడని, ఆయన జయంతిని జనజాతీయ గౌరవ్ దివస్‌గా కేంద్రం ప్రకటించడం మనందరికీ గర్వకారణమని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి రాజన్నదొర అన్నారు. రాష్ట్ర గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఆర్కేబీచ్‌లో మంగళవారం గిరిజన గౌరవ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గిరిజన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ.. బిర్సా ముండా జయంతి పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాలను డిప్యూటీ సీఎం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల పోరాట గాథలు, వారసత్వ సంస్కృతీ సంప్రదాయలు, గిరిజన నృత్యాలు ప్రపంచానికి తెలియజేసుందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. గిరిజన స్వాతంత్ర్య సమరయోధులను ఈ సందర్భంగా స్మరించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. గిరిజనులకు వైఎస్సార్ సీపీ అండగా ఉందని.. ఆదివాసీల రాజకీయ, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. గిరిజనులకు ప్రమాదకరంగా భావించి బాక్సైట్ తవ్వకాలను నిలుపుదల చేశారన్నారు. రాబోయే 30 ఏళ్లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగుతారని.. ఆయన మనమంతా అండగా ఉందామన్నారు.

గిరిజన స్వాతంత్ర్య సమరయోధులకు సరైన గుర్తింపు

రాష్ట్రంలో గిరిజన స్వాతంత్ర్య సమరయోధులకు ఈ ప్రభుత్వంలోనే సరైన గుర్తింపు లభించిందని ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, కె.భాగ్యలక్ష్మి, కళావతి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 520 మంది సమరయోధుల శిలాఫలకాలను వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 21న ఆవిష్కరిస్తామన్నారు. బీచ్‌రోడ్డులో అల్లూరి సీతారామరాజు ప్రధాన అనుచరులు గంటందొర, మల్లుదొర విగ్రహాలను ఆవిష్కరించడం ఆనందంగా ఉందని చెప్పారు.

ఉత్సాహంగా కార్నివాల్

వారోత్సవాల్లో భాగంగా రాష్ట్రంలోని పలు గిరిజన ప్రాంతాలకు చెందిన 3 వేల మంది యువతీయువకులు వైఎంసీఏ నుంచి భారీ కార్నివాల్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర ప్రారంభించారు. కార్నివాల్‌లో భాగంగా గిరిజన సంప్రదాయ వస్త్రాలు ధరించి నృత్యాలు చేశారు. కొమ్ము కోయ డ్యాన్సులు, థింసా నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముఖ్య అతిథులు వారితో డ్యాన్సులు చేశారు.

ఎగ్జిబిషన్ ప్రారంభం

రాష్ట్రంలో వివిధ గిరిజన ప్రాంతాల్లో లభించే వంటలు, కళాకృతులు, ఆహారధాన్యాలతో కూడిన ఎగ్జిబిషన్‌ను డిప్యూటీ సీఎం రాజన్నదొర ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్ బుధ, గురువారాల్లో నగరవాసుల సందర్శనార్థం కొనసాగించనున్నారు. కార్యక్రమంలో అరకు ఎంపీ మాధవి, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, గిరిజన సంఘాలు నాయకులు పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన స్టాల్



బెలూన్లు విడుదల చేసి కార్నివాల్‌ను ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర



థింసా నృత్యం



కొయా నృత్య ప్రదర్శన



మన్యం గుండెల్లో సూపర్‌స్టార్

సూపర్ స్టార్ కృష్ణ సినీ జీవితంలో 350కు పైగా సినిమాలు చేసినా.. అందులో 'అల్లూరి సీతారామరాజు' చిత్రానికి ప్రత్యేక స్థానం ఉంది. ఈసినిమాలో దాదాపు 90 శాతం సన్నివేశాలు ఉమ్మడి విశాఖ జిల్లా చింతపల్లి ప్రాంతంలో చిత్రీకరించారు. ఈ సినిమా చిత్రీకరణకు ముందు హీరో కృష్ణ, దర్శకుడు ఈ ప్రాంతంలో పర్యటించి కథకు అవసరమైన లొకేషన్లను ఎంపిక చేశారు. తొలి చారిత్రక చిత్రంగా చరిత్రలో నిలిచిపోవడంతో ఈ ప్రాంత గిరిజనుల గుండెల్లో సూపర్‌స్టార్ కృష్ణ ముద్ర వేసుకున్నారు. ఇలా ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టిన సూపర్‌స్టార్ కృష్ణ చనిపోయారన్న వార్త.. అభిమానులను దుఃఖ సాగరంలో ముంచెత్తింది.

- చింతపల్లి ప్రాంతంతో కృష్ణకు విడదీయరాని అనుబంధం
- అల్లూరి సీతారామరాజు సినిమాలో అత్యధిక సన్నివేశాలు ఇక్కడివే
- సినిమాకు అవసరమైన లొకేషన్లు ఎంపిక చేసినది ఆయనే
- అభిమానులను దుఃఖసాగరంలో ముంచెత్తిన మరణవార్త



కళాప్రపూర్ణ అందుకుంటున్న సూపర్‌స్టార్ కృష్ణ

సాక్షి, పాడేరు: అల్లూరి సీతారామరాజు పేరు చెబితే అందరికీ సూపర్‌స్టార్ కృష్ణ గుర్తుకువస్తుంటారు. ఈ సినిమాను ఈ ప్రాంతంలో చిత్రీకరించడం ద్వారా ఆయనకు ఏజెన్సీతో విడదీయరాని అనుబంధం ఏర్పడింది. ఈ సినిమాలో ఎక్కువ శాతం సన్నివేశాలను చింతపల్లి ప్రాంతంలోనే చిత్రీకరించారు. దీనిలో భాగంగా సుమారు ఏడు నెలలపాటు చిత్ర యూనిట్ చింతపల్లిలో ఉంది. 1973–74లో ఈ సినిమాను చిత్రీకరించారు.ఈ సినిమాకు త్రిపురనేని మహారథి కథ అందించగా వి.రామచంద్రరావు దర్శకత్వం వహించారు. సినిమా షూటింగ్ ప్రారంభానికి ముందే దర్శకుడితో పాటు, హీరో కృష్ణ ఏజెన్సీలోని గిరిజన ప్రాంతాలను సందర్శించారు. పోరాటం సమయంలో అల్లూరి సీతారామరాజు, బ్రిటిష్ వారు సంచరించిన ప్రాంతాలు, వారు బస చేసిన స్థలాలను పరిశీలించారు. కథకు అవసరమైన లొకేషన్లను గుర్తించారు.

పద్మావతి నగర్‌గా నామకరణం..


చింతపల్లి మెట్టబంగ్లా సమీపంలోని ఖాళీ స్థలంలో చిత్ర యూనిట్ అంతటికి తాత్కాలిక నివాసాలను అప్పట్లో నిర్మించారు. ఈ ప్రాంతానికి పద్మావతి నగర్ అని కృష్ణ నామకరణం చేసినట్టు స్థానికులు తెలిపారు. హీరో కృష్ణతో పాటు, ఇతర నటీనటులు, సాంకేతిక సిబ్బంది అంతా ఇదే ప్రాంతంలో బస చేసేవారు. ఇక్కడి ఉంటూ లంబసింగి, లోతుగెడ్డ జంక్షన్, తాజంగి తదితర ప్రాంతాల్లో ఈ సినిమాకు సంబంధించిన సన్నివేషాలు చిత్రీకరణకు వెళ్తుండేవారని స్థానికులు చెబుతున్నారు. చిత్రంలోని కొన్ని సన్నివేశాలను డుంబ్రిగుడ మండలం చాపరాయిలో కూడా చిత్రీకరించినట్టు వారు తెలిపారు. సినిమా షూటింగ్ జరిగిన రోజుల్లో హీరో కృష్ణ గిరిజనులు, చింతపల్లిలోని వర్తకులతోను మమేకం అయ్యేవారని చెబుతుంటారు.

మరికొన్ని చిత్రాలు..

సూపర్ స్టార్ కృష్ణ నటించిన తెలుగు వీరలేవరా, జయం మనదే వంటి సినిమాలను అరకులోయ ప్రాంతంలో చిత్రీకరించారు. పాడిపంటల సినిమాలో ఒక పాటను సీలేరు, గుంటవాడ డ్యామ్, సప్పర్ల రెయిన్‌గేజ్ అటవీ ప్రాంతంలో చిత్రీకరించారు. అప్పట్లో హీరో కృష్ణ, నటీనటులంతా వారం రోజులపాటు సీలేరు ప్రాంతంలోనే ఉన్నారు. హీరో కృష్ణకు అరకులోయ, పాడేరు, చింతపల్లి ప్రాంతాల్లో అభిమాన సంఘాలు ఉన్నాయి. వీరంతా ఏటా పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహిస్తుంటారు. ఆయన మరణవార్త అభిమానులను కలిచివేసింది. వారు కూడా విషాదంలో మునిగిపోయారు.

విశాఖతోనూ..

సాక్షి, విశాఖపట్నం: సూపర్‌స్టార్ కృష్ణకు సాగరతీరంతో ఎక్కువ అనుబంధం ఉంది. వాస్తవానికి ఆయన సినిమాలు ఎక్కువ శాతం చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాల్లోనే చిత్రీకరించేవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సినిమా తీయాలి అంటే విశాఖ వైపే మక్కువ చూపేవారు. నటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా, స్టూడియో అధినేతగా పేరు ప్రఖ్యాతలు సంపాదించిన సూపర్‌స్టార్ కృష్ణ జ్ఞాపకాలు తీరంలో పదిలంగానే ఉన్నాయి.



- విశాఖతో ఈ అనుబంధాన్ని జీవితాంతం నిలబెట్టుకోవాలనే ఆకాంక్షతో.. పద్మాలయ ఫిల్మ్ స్టూడియో విశాఖలో నిర్మించాలని ఉందని అనేక మార్లు కృష్ణ మీడియాకు చెప్పేవారు. సూపర్‌స్టార్ కృష్ణ విశాఖ వచ్చిన ప్రతీసారి బీచ్ రోడ్డులోని పార్క్ హోటల్‌లో ఆయన బస చేసేవారట. పార్క్ హోటల్‌లో ఆయన సినిమాల్లోని పాటల చిత్రీకరణ కూడా జరిగింది. కృష్ణ, కృష్ణంరాజు కలిసి నటించిన అడవి సింహాలు చిత్రం షూటింగ్ సాగరతీరంలో జరిగింది.

కళాప్రపూర్ణ ప్రదానం

సినీ నటుడు కృష్ణకు 2008లో ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ(గౌరవ డాక్టరేట్)ను ప్రదానం చేసింది. ఆచార్య ఎల్.వేణుగోపాలరెడ్డి ఏయూ ఉపకులపతిగా పని చేసిన కాలంలో కళారంగంలో చేసిన సేవలను గుర్తిస్తూ 75వ స్నాతకోత్సవంలో ఆయనను కళాప్రపూర్ణతో సత్కరించింది. ఏయూలోని సీఆర్‌రెడ్డి కాన్వొకేషన్ హాలులో జరిగిన ఈ కార్యక్రమానికి విజయనిర్మలతో కలసి కృష్ణ పాల్గొన్నారు. కృష్ణ మృతి పట్ల ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.



లంబసింగిలో అల్లూరి సీతారామరాజు సినిమా చిత్రీకరణ సమయంలో కృష్ణ బసచేసిన బ్రిటిష్ వారి హయాంలో నిర్మించిన అతిథి గృహం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏకపక్షంగా విజయం సాధించాలి

ఉమ్మడి విశాఖ వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ.సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న ఉమ్మడి విశాఖ వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, చిత్రంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయానికి పార్టీ నేతలంతా కృషి చేయాలని ఉమ్మడి విశాఖ వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం మద్దిలపాలెం పార్టీ నగర కార్యాలయంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌లతో కలిసి ఎంపీలు, ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలతో పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాల రాష్ట్ర, జిల్లా అనుబంధ సంఘాల నాయకులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. ఈనెల 12న విశాఖలో జరిగిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సభను విజయవంతం చేసిన నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాన్నారు. ఈ మహాసభ రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, భీశెట్టి సత్యవతి, అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, పండుల రవీంద్ర బాబు, ఎమ్మెల్యేలు కన్నబాబురాజు, గొల్ల బాబూరావు, వాసుపల్లి గణేష్‌కుమార్, కె.భాగ్యలక్ష్మి, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, తిప్పల నాగిరెడ్డి, సమన్వయకర్తలు ఆడారి ఆనంద్, అక్కరమాని విజయనిర్మల, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, ఎస్.ఎ.రెహమాన్, ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్, కార్పొరేషన్ చైర్మన్‌లు, ముఖ్యనాయకుడు రవిరెడ్డి, అనకాపల్లి జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, ప్రేమ్‌బాబు, మొల్లి అప్పారావు, సతీష్‌వర్మ, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

పక్కాగా భూముల రీసర్వే

కలెక్టర్ సుమిత్‌కుమార్



సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: వివాదాలకు తావులేకుండా భూముల రీ సర్వే ప్రక్రియ పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో భూముల రీ సర్వే పై మండల, గ్రామ సచివాలయం సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత ఎటువంటి సమస్యలు లేకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. వెక్టరైజేషన్ సక్రమంగా జరగాలని స్పష్టం చేశారు. మండల సర్వేయర్లు, తహసీల్దార్లు భూములను స్వయంగా సందర్శించి, ఆయా అభ్యంతరాలను పరిశీలించాలని సూచించారు. సర్వేయర్లు ఎఫ్ఎంబీలను దగ్గర ఉంచుకుని పారదర్శకంగా భూముల రీ సర్వే చేయాలన్నారు. ఎఫ్ఎంబీలపై సర్వేయర్లకు, రెవెన్యూ అధికారులకు పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలన్నారు. ముసాయిదా ల్యాండ్ రిజిస్టర్ లో ఎలాంటి తప్పులు, జాయింట్ పట్టాలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీఆర్వోలు ,గ్రామ సర్వేయర్లు, మండల సర్వేయర్లు, కలెక్టరేట్ ల్యాబ్‌లో వెక్టరైజేషన్ చేయాలని, భూముల రీ సర్వే డేటాను, నాణ్యతలు పరిశీలించి తహసీల్దార్ లాగిన్ నుండి ఆర్డీవో లాగిన్‌కు పంపించాలని అన్నారు. రెవెన్యూ అధికారులు మ్యుటేషన్ వేగవంతం చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, ఆర్డీవో బి.దయానిధి, సర్వే సహాయ సంచాలకులు వై.మోహన్‌రావు, మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు సకాలంలో పూర్తి

రంపచోడవరం పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ శాఖ ద్వారా చేపట్టిన భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో మంగళవారం వారితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు మండలాల్లో సీసీడీపీ నిధులతో నిర్మిస్తున్న భవనాల సకాలంలో పూర్తి చేయాలన్నారు. సీసీడీపీ నిధులు ఎంత వచ్చాయి, ఎంత ఖర్చు చేశారు అనే విషయాలపై చర్చించారు. గుడిసె పర్యాటక ప్రాంతంలో నిర్మిస్తున్న భవనాలు, బోదులూరు గ్రామంలో నిర్మిస్తున్న గొడౌన్, కల్వర్టులకు సంబంధించి పనుల వివరాలను తెలుసుకున్నారు. పూర్తి చేసిన భవనాలకు విద్యుత్, మౌలిక సదుపాయాలు సకాలంలో కల్పించాలని ఆదేశించారు. ఏజెన్సీలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో హాట్ బజార్లు ఏర్పాటుపై ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఈఈ జి.డేవిడ్‌రాజ్, ఏఈ సత్యనారాయణ, నాగరాజు, మహేశ్వరరావు, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.



ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

సీఎం జగన్ నాయకత్వంలోనే గిరిజనుల అభ్యున్నతి
- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- టీడీపీకి చెందిన పది కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

-8లో

సీఎం జగన్ నాయకత్వంలోనే గిరిజనుల అభ్యున్నతి

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

సాక్షి, పాడేరు: ఏజెన్సీలోని అన్ని వర్గాల ప్రజలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని కోరుకుంటున్నారని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. పాడేరులో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పెదబయలు మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ కోడువలస గ్రామంలో టీడీపీకి చెందిన 10 కుటుంబాలు అరకులోయ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీలో చేరిన కిల్లో తిరుపతి, రాంబాబు, బంగ్రన్న, జగన్నాథం, కొర్ర బాలకృష్ణ తదితరులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలన, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. ఏజెన్సీలో పార్టీ మరింత అభివృద్ధికి తామంతా కృషి చేస్తామన్నారు.అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ నియోజకవర్గంలో అభివృద్ధి పాటుపడుతున్నారన్నారు. ఈ మేరకు సీఎం జగన్, అరకు ఎమ్మెల్యే పాల్గుణల నాయకత్వానికి సంపూర్ణ మద్దతునిస్తూ వైఎస్సార్‌సీపీలో చేరడం ఆనందంగా ఉందన్నారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ఏజెన్సీలోని అన్ని వర్గాల గిరిజనుల సంక్షేమ లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సూర్యనారాయణ, యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్ తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులకు పార్టీ కండువా వేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

విద్యుత్ తీగలు తగిలి ఒకరికి గాయాలు

వై.రామవరం: రాచపాలెం గ్రామానికి చెందిన వలాల నూకరాజు(55) అనే గిరిజనుడు మంగళవారం తెల్లవారు జామున విద్యుత్‌షాక్‌తో తీవ్ర గాయాలపాలయ్యాడు. అతనిని కుటుంబ సభ్యులు స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించగా వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్య పరీక్షల కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేసి 108లో తరలించారు. ఎస్‌ఐ ఎం.సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలివి. రాచపాలెం పొలాల్లో అడవి జంతువుల వేట కోసం విద్యుత్ తీగలు అమర్చగా, ఆ పొలంలోకి వెళ్లిన నూకరాజు ప్రమాదవశాత్తూ తీగల మీద పడడంతో గాయాలపాలయ్యాడు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. విద్యుత్ తీగలతో అడవి జంతువులను వేటాడిన వారిపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.


అడవి జంతువుల వేటకు అమర్చిన విద్యుత్ తీగపై పడి గాయపడిన నూకరాజు

మెరుగైన వైద్యం అందించండి

మహారాణిపేట (విశాఖ దక్షిణ): కేజీహెచ్‌కు వచ్చే గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ ఆదేశించారు. మంగళవారం ఆయన కేజీహెచ్‌లోని ట్రైబల్ సెల్‌ను సందర్శించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి రోజువారీ కేజీహెచ్‌కు వస్తున్న రిఫరల్ కేసులు, ఇతర రోగుల వివరాలు, వారికి అందిస్తున్న వైద్యసేవలు, ట్రైబల్ సెల్ పనితీరుపై పీవో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రైబల్ సెల్‌కు మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు.ఏజెన్సీ నుంచి వచ్చే రోగులందరికి సత్వర వైద్యం అందించే విధంగా ట్రైబల్ సెల్ అధికారులు, ఉద్యోగులు బాధ్యత తీసుకోవాలన్నారు. కేజీహెచ్‌లో అత్యవసర వైద్యసేవలపై మరింత దృష్టిసారించాలనిన ఆదేశించారు. గిరిజన ప్రాంత రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రోగుల కేసు సీటులను పరిశీలించారు. వార్డు గదులలో రోజువారీ అందుతున్న వైద్యసేవలను సమీక్షించాలని సూచించారు. 24గంటల పాటు ట్రైబల్ సెల్ గిరిజనులకు సేవలు అందించాలని పీవో ఆదేశించారు. గిరిజనుల ఆరోగ్యం పట్ల ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని, వైద్య ఆరోగ్య సేవలపై వారికి అవగాహన కల్పించాలని కేజీహెచ్ వైద్యాధికారులను పీవో ఆదేశించారు. అనంతరం గైనిక్ వార్డును ఆయన సందర్శించారు.ఇక్కడ వైద్యసేవలు పొందుతున్న గిరిజన మహిళలను పరామర్శించారు.వారికి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. పూర్తిగా కోలుకునే వరకు వైద్యసేవలు పొందాలని, ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వైద్యులు, ట్రైబల్ సెల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని రోగులకు సూచించారు. కోరారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మైథిలి, ఆర్‌ఎంవో డాక్టర్ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.


కేజిహెచ్‌లో చికిత్స పొందుతున్న గిరిజన రోగులను పరామర్శిస్తున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

సత్యదీక్షల ఇరుముడుల స్వీకరణకు ఏర్పాట్లు

అడ్డతీగల: అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి వారి సత్య దీక్ష విరమణకు ఇరుముడుల స్వీకరణ కార్యక్రమాన్ని అడ్డతీగలలో బుధవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య తెలిపారు. ఇందులో భాగంగా పవనగిరి క్షేత్రంలో రుషిపీఠం కల్యాణ మండపంలో బుధవారం ఉదయం 5 గంటల నుంచి ఇరుముడులు స్వీకరణ, అనంతరం గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. స్థానిక సాయిసన్నిధి కల్యాణ మండపంలో అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశామన్నారు.

నేడు రక్తదాన శిబిరం

చింతపల్లి: స్థానిక డిగ్రీ కళాశాలలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు పాడేరు రోటరీ క్లబ్ తెలిపింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరం జరుగుతుంది. రక్తదానం చేయదలచిన వారు 7670878983లో సంప్రదించాలని కోరింది.

క్షతగాత్రులకు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పరామర్శ

నర్సీపట్నం: ఏరియా ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న క్షతగాత్రులను పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పరామర్శించారు. చింతపల్లి మండలం తాజంగి పంచాయతీ శివారు కోరుకొండ గ్రామానికి చెందిన 14 మంది గిరిజనులు ఈ నెల 13న శుభ కార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా, సమగిరి వద్ద అదుపు తప్పి బొలేరో వాహనం బోల్తాపడింది. ఇందులో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది గాయపడటంతో నర్సీపట్నం తరలించారు. ఈ విషయాన్ని చింతపల్లి ఎంపీపీ కోరాబు అనూషాదేవి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆమెతోపాటు కలిసి ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మంగళవారం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. ఆస్పత్రి సూపరిండెంటెంట్ నీలవేణిదేవి క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూపరిండెంటెంట్‌కు సూచించారు. ఎమ్మెల్యే వెంట తాజంగి వైస్ సర్పంచ్ గెమ్మిల రవి, వైఎస్సార్‌సీపీ కొయ్యూరు మండలాధ్యక్షుడు జల్లి బాబు ఉన్నారు.


నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

బిర్సాముండాకు ఘన నివాళి


ఐటీడీఏలో బిర్సాముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఐటీడీఏ ఏపీవోలు


ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిర్సా ముండా చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నరసింగరావు

సాక్షి,పాడేరు: భగవాన్ బిర్సాముండా జయంతిని జిల్లాలోని అన్నిచోట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు,పలు గిరిజన విద్యార్థి, ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘాలు మంగళవారం ఘనంగా నిర్వహించాయి. స్థానిక ఐటీడీఏ సమావేశమందిరంలో ఆయన చిత్రపటానికి ఐటీడీఏ ఏపీవోలు వేంకటేశ్వరరావు, ప్రభాకరరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఐటీడీఏ ఏవో హేమలత, రిటైర్డ్ మేనేజర్ నాగేశ్వరరావు, పలు విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.గిరిజనుల ఆశాజ్యోతి బిర్సాముండా తప పోరాటాలతో గిరిజన జాతికి ఎంతో మేలు చేసి ఆదర్శనీయుడుగా చరిత్రలో నిలిచారని ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భగవాన్ బిర్సాముండా చిత్రపటానికి ఆయనతోపాటు సర్పంచ్‌లు సీదరి రాంబాబు,వంతాల రాంబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వనుము చిట్టబ్బాయి,అధ్యాపకులు,విద్యార్థులు,గిరిజన విద్యార్థి సంఘ భవనంలో ఆదివాసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు రామారావుదొర,జీఎస్‌యు నేతలంతా బిర్సాముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అసెంబ్లీ దృష్టికి ఉపాధ్యాయ సమస్యలు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ

ముంచంగిపుట్టు: ఉపాధ్యాయులు సమస్యలను అసెంబ్లీ దృష్టికి తీసుకువెళ్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. మండలంలోని బంగారుమెట్ట, కిలగాడ, జోలాపుట్టు, లబ్బూరు, పనసపుట్టు, ముంచంగిపుట్టులో ఇన ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడారు. ప్రతీ సమస్యను అసెంబ్లీ సమావేశంలో శాసనమండలి ద్వారా ప్రభుత్వానికి తెలియజేసి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. అనంతరం పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు రఘువర్మను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్యాంసుందర్, ఎస్‌బీఎల్‌స్వామి, దామోదర్,కొండపడాల్, రామన్న,కామేశ్వరరావు, బాలు తదితరులు పాల్గొన్నారు.


ముంచంగిపట్టులో ఎమ్మెల్సీ రఘువర్మను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

మార్చి వరకు కోరాపుట్ స్పెషల్‌కు విస్టాడోమ్ కోచ్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): విశాఖపట్నం-కోరాపుట్ మధ్య నడిచే స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు 2023 మార్చి నెలాఖరు వరకు విస్టాడోమ్ కోచ్ జత చేయాలని నిర్ణయించినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. గతంలో ఈ రైలుకు జతచేసిన విస్టాడోమ్ కోచ్ కాలపరిమితి ఈనెల 15తో ముగియగా దీన్ని పొడిగించారు. ప్రతీ సోమ, బుధ, శని వారాల్లో విశాఖలో బయల్దేరే విశాఖపట్నం-కోరాపుట్ (08546)స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు ఈనెల 16 నుంచి మార్చి 28వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో కోరాపుట్‌లో ప్రతీ మంగళ, గురు, ఆది వారాల్లో బయల్దేరే కోరాపుట్- విశాఖపట్నం (08545) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు ఈనెల 17 నుంచి మార్చి 30వ తేదీ వరకు ఈ విస్టాడోమ్ కోచ్‌ను జతచేయనున్నారు.

చలిగాలుల విజృంభణ

కొనసాగుతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు

సాక్షి, పాడేరు: ఏజెన్సీలోని చలి తీవ్రత అధికమైంది. ఉష్ణోగ్రతలు రోజు రోజుకు తగ్గుతుండడంతో చలి గాలులు విజృంభిస్తున్నాయి. పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీ బోర్డులో 12 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీ బోర్డులో 12.7 డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 13 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు మంగళవారం ఉదయం నమోదయ్యాయి. సాయంత్రం 4 గంటల నుంచే చలి గాలులు వీస్తుండడంతో మన్యంలోని అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అర్ధరాత్రి నుంచి పొగ మంచు దట్టంగా కురుస్తోంది. మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో సూర్యోదయం అయ్యింది. పొగ మంచుతో పాటు చలి గాలుల తీవ్రత అధికంగా ఉండడంతో వృద్ధులు, చిన్నారులతో పాటు ,వ్యవసాయ,కూలీ పనులు, వారపు సంతలకు వెళ్లే గిరిజనులంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


పాడేరులో మంట కాగుతున్న గిరిజనులు

అరకులోయలో 18న మెగా జాబ్‌మేళా

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని వైటీసీ కేంద్రంలో ఈనెల 18న ఏపి ఎస్ఎస్‌డీసీ, వెలుగు ప్రాజెక్టు ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కోఆర్డినేటర్ శ్యామ్ తెలిపారు. సుమారు 15 కంపెనీలు పాల్గొంటున్న ఈ మెగా జాబ్ మేళాను అర్హులైన నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 6303000080 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

హుకుంపేట: విద్యుత్ షాక్‌కు గురై యువకుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. దాలిగుమ్మడిలో కూడా హరిప్రసాద్(32) అనే యువకుడు రాత్రి తన ఇంటి వద్ద మోటర్ మరమ్మతు చేపడుతుండగా ప్రమాదవశాత్తూ కరెంట్ షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సతీష్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి స్వగ్రామం శోభకోట పంచాయతీ సంపంగిపుట్టులో విషాదఛాయలు అలుముకున్నాయి. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, స్థానిక ఎంపీపీ కూడా రాజుబాబు, చెట్టి వినయ్ సంతాపం తెలిపారు.


మృతి చెందిన హరిప్రసాద్

అథ్లెటిక్స్‌లో మెరిసిన గిరి యువకుడు

ముంచంగిపుట్టు: మండలంలోని పెదగూడ పంచాయతీ జర్రిపడ గ్రామానికి చెందిన గిరి యువకుడు కుర్తాడి ప్రసాద్ విశాఖలో జరిగిన అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరిచాడు. ఈ నెల 12,13వ తేదీల్లో విశాఖ ఉక్కునగరంలోని ఉక్కు స్టేడియంలో నిర్వహించిన 42వ రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్-2022 పరుగు పందెం పోటీల్లో సత్తా చాటాడు. 1500 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారు.800 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించాడు. 2023 ఫిబ్రవరి 11,12,13 తేదీల్లో వెస్టబెంగాల్‌లోని మిదానపూర్‌లో జరిగే జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక అయ్యాడు. అతనిని మండల ప్రజలు అభినందించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థికసాయం అందించి ప్రోత్సహించాలని ప్రసాద్ కోరాడు.


పతకం అందుకుంటున్న ప్రసాద్

ధారాలమ్మ ఆలయంలో సీసీ కెమెరాలు

సీలేరు: ప్రముఖ పుణ్యక్షేత్రం ధారకొండ ధారాలమ్మ అమ్మవారి ఆలయంలో దేవదాయశాఖ అధికారులు మంగళవారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇటీవల ఆలయంలో దోపిడీ జరిగిన విషయం తెలిసిందే. ఆ సమయంలో దుండగులు సీసీ కెమెరాలకు సంబంధించిన సీడీఆర్‌ను ఎత్తుకెళ్లారు. ఈ మేరకు కొత్త పరికరాన్ని ఏర్పాటు చేసి అమ్మవారి ఆలయ పరిసర ప్రాంతాల్లో ఏడు కెమెరాలు ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించి టీవీని కూడా ఏర్పాటు చేశారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

యలమంచిలి: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని ఆరెస్టు చేసినట్టు పట్టణ ఎస్‌ఐ పాపినాయుడు తెలిపారు. వివరాలివి. యలమంచిలి పట్టణం విజయలక్ష్మి పెట్రోల్ బంకు సమీపంలో రేగుపాలెం గ్రామానికి చెందిన కందూరి వరప్రసాద్ ఐదు మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు దాడి జరిపి పట్టుకున్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తె

బుచ్చెయ్యపేట: తండ్రికి తలకొరివిపెట్టి కుమార్తె రుణం తీర్చుకుంది. మేజర్ పంచాయతీ వడ్డాదికి చెందిన బుల్లితెర నటుడు బత్తుల సత్తిబాబు(సత్తిపండు) అనారోగ్యంతో సోమవారం హైదరాబాద్‌లో మృతి చెందాడు. అతనికి భార్య స్వప్న, కుమార్తె ప్రచీత ఉన్నారు. కొడుకులు లేకపోవడంతో ప్రచీత కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం తండ్రి సత్తిపండుకు దహన సంస్కారాలు చేసింది. హైదరాబాద్ స్మశాన వాటికలో కుటుంబ సభ్యుల సమక్షంలో ప్రచీత తండ్రి అంత్యక్రియల్లో పాల్గొంది. సత్తి పండు అంత్యక్రియల్లో పలువురు అర్టిస్టులు,నాయకులు పాల్గొన్నారు.

జలపాతంలో పడి యువకుడు మృతి

మోతుగూడెం: ప్రమాదవశాత్తూ పొల్లూరు జలపాతంలో పడి పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన శివాసి పవన్‌కుమార్(19) అనే యువకుడు మంగళవారం మృతి చెందాడు. మెకానిక్‌గా పనిచేస్తున్న పవన్‌కుమార్‌తో సహా ఏడుగురు స్నేహితులు కలసి చింతూరు మండలంలోని పొల్లూరు జలపాతం చూసేందుకు వచ్చారు. స్నానం చేసేందుకు జలపాతంలోకి దిగిన వారిలో పవన్‌కుమార్ ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మోతుగూడెం ఎస్‌ఐ సత్తిబాబు తెలిపారు.


పవన్‌కుమార్ మృతదేహం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అనకాపల్లిటౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. గ్రామీణ ఎస్‌ఐ నర్సింగరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. గ్రేటర్ విశాఖ విలీన గ్రామమైన కొప్పాక జాతీయ రహదారిపై సైకిలిస్టును వెనుక నుంచి టాటా ఏసీ వాహనం ఢీకొంది. ఈ ఘటనలో సైకిలిస్టు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని వివరాలు తెలియాల్సి ఉందని ఎస్‌ఐ పేర్కొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

కాకినాడ జెడ్పీ సమావేశంలో కూనవరం, గంగవరం జెడ్పీటీసీలు విజయ, బేబీరత్నం

కూనవరం/గంగవరం: కాకినాడలో మంగళవారం జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో కూనవరం, గంగవరం ప్రాంతాల్లోని పలు సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులు వివరించారు. ఇందులో భాగంగా కూనవరం జెడ్పీటీసీ సభ్యురాలు విజయ, ఎంపీపీ రంగమ్మ మాట్లాడుతూ మండలంలోని నాలుగుసార్లు వచ్చిన గోదావరి వరదల కారణంగా రైతులు సాగుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులకు మోటార్ కనెక్షన్లు ఇవ్వాలని, పాఠశాలలను అభివృద్ధి చేయాలని కోరారు. పలు సమస్యలపై జెడ్పీ చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా పరిషత్ సమావేశంలో గంగవరం జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం మాట్లాడుతూ కుసుమరాయి- మర్రిపాలెం రహదారికి నిధులు మంజూరు చేయాలని, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు పూర్తి చేయించాలని కోరారు. రాష్ట్ర ఆర్‌అండ్‌బీ మంత్రి దాడిశెట్టి రాజా, జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు సానుకూలంగా స్పందించి తగిన హామీ ఇచ్చారని జెడ్పీటీసీ బేబిరత్నం తెలిపారు.


మాట్లాడుతున్న జెడ్పీటీసీలు విజయ, బేబీరత్నం

60 లీటర్ల సారాతో ఇద్దరు అరెస్ట్

సాక్షి, పాడేరు: పెదబయలు మండలం సీతగుంట జంక్షన్ సమీపంలో 60 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ విభాగం ఏఈఎస్ డి.వి.రాజు తెలిపారు. మంగళవారం ఉదయం ఈ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించగా ఆటోలో అక్రమంగా తరలిస్తున్న సారా మూటలను గుర్తించామన్నారు. సారా రవాణాకు పాల్పడిన నిందితులు అక్కిరామ్, గొల్లోరి నీలకంఠలను అరెస్టు చేసి, ఆటోను సీజ్ చేశామన్నారు. ఈ దాడుల్లో సీఐ జె.కుర్మారావు, ఎస్‌ఐ బి.వి.రాజు, సిబ్బంది శ్రీనివాసరావు, బీమలింగేశ్వరావు పాల్గొన్నారు.


పట్టుబడిన సారా, నిందితులతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

స్వల్పకాలిక టెండర్ ప్రకటన

2022 - 23 వ విద్యా సంవత్సరమునకు అల్లూరి సీతారామరాజు జిల్లా, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ పాడేరు పరిధిలో గల 9 పాఠశాలలు 10 కళాశాలలు 11 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ 1 స్కూల్ ఆఫ్ ఎక్సెలెన్సు, 1 స్పోర్ట్స్ స్కూల్ మరియు 3 మినిగురుకులాల విద్యా సంస్థలకు భోజన సదుపాయాల కల్పించు నిమిత్తం కూరగాయలు, పండ్లు మరియు కోడిగుడ్లు సరఫరా చేయు నిమిత్తం ఆసక్తి గల టెండర్‌దారుని నుండి ధరఖాస్తులు కోరబడుచున్నవి. టెండర్ ధరఖాస్తులు దగ్గరలోని అన్ని గురుకులం విద్యా సంస్థలు మరియు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో లభించును. పూర్తిచేసిన దరఖాస్తులను శ్రీయుత ప్రాజెక్ట్ అధికారి వారి పేరున డి.డి. రూపంలో చెల్లించి పూర్తిచేసిన దరఖాస్తును స్థానిక గురుకులం సెల్ ఐ.టి.డి.ఏ పాడేరు నందు ఈ నెల 16.11.2022వ తేదిన నుండి 24.11.2022 తేదీ వరకు ఏర్పాటు చేసిన టెండర్ బాక్స్ నందు సీల్డ్ కవరులో వేయగలరు. సీల్డ్ వేసిన టెండర్ ధరఖాస్తులను 26.11.2022 తేదిన శ్రీయుత ప్రాజెక్ట్ అధికారి ఐ.టి.డి.ఏ పాడేరు నందు వారి సమక్షం లో సీల్డ్ టెండర్లు తెరువబడిన టెండర్లు ఖరారు చేయబడును. గిరిజన వ్యాపారులకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వబడును. మరిన్ని వివరముల కొరకు దగ్గరలో ఉన్న గురుకులం విద్యా సంస్థలు మరియు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో సంప్రదించగలరు.

పథక నిర్వహణ అధికారి
ఐ.టి.డి.ఏ.పాడేరు